# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

November - 2000

# సంక్షిప్త వార్తలు

2000 సెప్టెంబరు 29నుండి అక్టోబరు 2వ తేదీ వరకు జాషువా గూటం దంపతులు ఢిల్లీలో యుండి రేడియో ప్రసంగములను రికార్డు చేసిరి. న్యూఢిల్లీలో అమెరికానుండి వచ్చిన జె.సి.ఛోట్ గారు క్రొత్త రేడియో ప్రసంగములను రికార్డు చేసి, వాటిని కొలంబోకు స్వయంగా తీసికొని వెళ్లి శ్రీలంక రేడియో స్టేషనులో వాటిని అప్పగించిరి. అవి ఇప్పుడు రేడియో శ్రీలంక ద్వారా ప్రసారమవుచున్నవి.

2000 అక్టోబరు 9వ తేదీ సోమవారం సాయంత్రం రాజమండ్రికి సమీపములో యున్న మధురపూడిలో గొప్ప సువార్త కూటమును మధురపూడి క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిరి. దానిలో సోదరులు హర్షల్ బియర్డెన్ గారు, జాషువా గూటం గారు పాల్గొనిరి. హర్షల్ గారు చక్కటి వాక్య పరిచర్య చేసి, అక్కడ ఆలయ నిర్మాణము కొరకు శంఖుస్థాపన చేసిరి. సోదరులు వి.సుదర్శన రావ్ గారి ఆధ్వర్యములో మధురపూడిలో క్రీస్తు కొరకు మంచిపని జరుగు చున్నది.

అక్టోబరు 10వ తేదీ మంగళవారం రాజోలు మండలం కడలి గ్రామము లో మంచి సువార్త కూటమును అక్కడి స్థానిక సంఘము నిర్వహించిరి. దానిలో హర్షల్ గారు, జాషువా గారు పాల్గొనిరి. హర్షల్ గారు వాక్య పరిచర్య చేయగా సాల్మన్‌గారు తర్జుమా చేసిరి. కూటము అనంతరం కడలి క్రీస్తు సంఘ ఆలయ నిర్మాణము యొక్క శంఖుస్థాపన చేయబడెను. అది హర్షల్ గారి యొక్కయు, జాషువా గారి యొక్కయు చేతులమీదుగా ప్రార్థన పూర్వకముగా జరిగెను. కడలిలోను, పరిసర ప్రాంతములలోను సోదరులు వి.చిన్నయ్య గారు క్రీస్తు కొరకు మంచిపని చేయుచున్నారు.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 | నవంబరు 2000 | సంచిక 4


# బైబిలు యొక్క సారాంశము

( The theme of the Bible)

బైబిలు అను మాట బిబ్లాస్ అను గ్రీకు పదమునుండి ఉద్భవించినది. బిబ్లాస్ అను మాటకు గ్రంథము అని అర్థము. బైబిలు నిజానికి 66 గ్రంథముల సంపుటియై యున్నది. వీటిలో 39 పాతనిబంధనలోను 27 క్రొత్త నిబంధనలోను యున్నవి. ఈ 66 పుస్తకముల సంపుటిని మనం పరిశుద్ధగ్రంథమని పిలుస్తాము. బైబిలు అంతయు ఇంచుమించు 1600 సంవత్సరాల్లో 40 మంది వ్యక్తులచే లిఖించబడినది. ఈ 40 మందిలోను 39 మంది యూదులు. ఒకే ఒక్కడు భక్తుడైన లూకా అన్యజాతీయుడు. బైబిలును మనం చదువుటకారంభించుచున్నామంటే దానియొక్క సారాంశాన్ని కొంత ఎరిగియుండాలి. బైబిలు యేమి బోధించుచున్నది? అది యేమిచేయమని చెప్పుచున్నది? అది మానవులకు ఎందుకు ఇయ్యబడింది ? వగయిరాలు మనం తెలుసుకోవాలి.

పాపములో పడిపోయిన మానవుని విమోచించుటయే బైబిలుయొక్క ముఖ్యోద్దేశమై యున్నది. యేసుక్రీస్తు ద్వారా దేవుని మహిమార్థము పాపముల నుండి మానవుని రక్షించుటయే దాని ధ్యేయము. అంటే ఈ భూమిమీద మానవుని

ఉత్పత్తి, అతని పతనము మరియు యేసుక్రీస్తు ద్వారా అతని పునరుత్పత్తిని గూర్చి అది తెలియజేయుచున్నది. యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చుట, ఆయన ఆగమనము, కృషి, మరణము, సమాధి, పునరుత్థానము, ఆరోహణము మరల ఆయన పునరాగమనమును గూర్చి బైబిలు బోధించుచున్నది. ఇంకో మాటలో దేవుని కుమారుడైన యేసుక్రీస్తు యొక్క అవతారమును గూర్చి లేఖనములు బోధించేదేమిటో మనం తెలిసికొనుటకు ప్రయత్నం చేయుదము.

## ప్రేమాస్వరూపి

ఈ సందర్భములో, దేవుడు మానవుని ఎందుకు సృజించెను? అనే ప్రశ్న మనకు రావచ్చును. మానవుని అవుసరత దేవునికి యేమైనా వున్నదని ఆయన మానవుని సృజించలేదు. యెహోవా దేవుని యొక్క లక్షణము ప్రేమ గనుక, ఆయన తన చిత్తానుసారముగా ప్రేమవలన మానవుని సృజించెనని మనం అనుకోవచ్చును. "దేవుడు ప్రేమాస్వరూపి. ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు" (1యోహాను 4:8). పరలోకములో యున్న పరిశుద్ధులు "యుగయుగములు జీవించుచున్నవానికి నమస్కారముచేయుచు, ప్రభువా మాదేవా నీవు సమస్తమును సృజించితివి; నీ చిత్తమును బట్టి అవియుండెను; దానిని బట్టియే సృజింపబడెను'' అని చెప్పుచుందురు (ప్రకటన 4:11). గనుక దేవుని చిత్తమును బట్టియే మానవులు భూమిపై సృజింపబడిరని మనం గ్రహించుకొనవచ్చును.

## ఆత్మస్వరూపి

భూమి మీదనున్న జీవరాసులన్నిటికంటే మానవుడొక్కడు మాత్రమే దేవుని స్వరూపమందు, దేవుని పోలికచొప్పున చేయబడెను (ఆది. కా. 1:26). దేవుడు భౌతికకాయుడు కాదు. ఆయన ఆత్మస్వరూపి (యోహాను 4:24). అందువలన దేవుని ఆత్మస్వరూపంలో మానవుడు చేయబడ్డాడు. మానవుడు విచక్షణ కలిగి, స్వేచ్ఛ, యిచ్ఛ, వాంఛ కలిగినవాడుగా సృజింపబడ్డాడు. అందువలన మానవుడు క్రీస్తుననుసరించుచు నీతియు యదార్థమైన భక్తియుగలవాడై దేవుని పోలికగా సృజింపబడిన నవీనస్వభావమును ధరించుకొనవలెనని హెచ్చరింపబడియున్నాడు (ఎఫెసీ. 4:24).

వివక్షణ, ఇచ్ఛ, వాంఛ కలిగినవాడు గనుక మానవుడు ఎంపికచేసుకొనే స్వేచ్ఛగలవాడు. అతడు మంచినిగాని, చెడుగునుగాని ఎంచుకోగలడు, ఎంచుకో వచ్చును (యెహోషువా 24:15). సరిగదా అతడు నమ్మకముగా దేవుని సేవించేబాధ్యత గలవాడు. "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడచుచుండవలెను, మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13). ఇట్టి విధిని కలిగియుండికూడ దురదృష్టవశాత్తు మానవుడు కీడును ఎంచుకొనుచున్నాడు. తద్వారా పాపముచేయుటకు ఎంచుకొనుచున్నాడు.

## పాపము యొక్క వాస్తవికత

పాపము యొక్క వాస్తవికతను (The reality of sin) మనందరము ఎరిగినదే. "పాపము చేయనివాడు ఒకడును లేడు" అని లేఖనములు బోధించుచున్నవి. (1రాజులు 8:46). నిజమే అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (రోమా. 3:23). "మనము పాపములేనివారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము. మరియు మనలో సత్యముండదు" (1యోహాను 1:8). మరియు "మనము పాపము చేయలేదని చెప్పుకొనినయెడల, దేవునిని అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1యోహాను 1:10).

మానవుని యొక్క మనస్సాక్షి అతనిని నైతికచట్టానికి బద్ధునిగాచేయును. ఆత్మీయవివక్షణ కలిగినవాడెవడును పాపమును బట్టి అపరాధిని కాదనలేడు. పాపము వలన కలిగే భయంకర పరిణామములు పాపము యొక్క వాస్తవికతను చాటిచెప్పుచున్నవి. పాపము వలన కలిగిన దౌష్ట్యము వలన శారీరకంగా మానవుడు రోగములననుభవించుచున్నాడు. భౌగోళికముగా నోవహు కాలమునాటి జలప్రళయము వలన ఈ భూమియొక్క తత్వము వాతావరణము మార్చబడినది. తత్ఫలితముగా వరదలు, భూకంపములు, కలుగుచున్నవి. నోవహు కాలమునాటి పాపప్రపంచమును తడిచివేయుటకు దేవుడు గొప్ప జలప్రళయమును రప్పించెనని మనం ఎరుగుదుము (ఆది.కా. 6:5). సాంఘికంగా మానవుల భాషలు తారుమారు

చేయబడుట వలన వారి మధ్య తీవ్రగందరగోళము ఏర్పడియున్నది. జలప్రళయం తరువాత ప్రజలు బాబెలు గోపురం నిర్మించయత్నించినందున దేవుడు వారి భాషలు తారుమారుచేసెను (ఆది.కా. 11:1-9). మానసికంగా మానవుడు ఆత్మశాంతిని కోల్పోయియున్నాడు. ఈ 21వ శతాబ్దములో యిది మరింత ఎక్కువ కనబడుచున్నది. మానసిక రోగులను పరీక్షించే వైద్యులు రోజురోజుకు సంఖ్యలో పెరిగిపోవుచున్నారు. "దుష్టులకు నెమ్మది యుండదని నాదేవుడు సెలవిచ్చు చున్నాడు" (యెషయా. 57:21). "శాంత వర్తనమును వారెరుగరు. వారి నడకలలో న్యాయము కనబడదు" (యెషయా. 59:8). ఆత్మీయముగా, పాపము వలన తనకును దేవునికిని మధ్య గొప్ప అగాధము తెచ్చిపెట్టుకొనియున్నాడు. "మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" (యెషయా 59:1-2). చివరకు పాపము వలన కలుగుజీతము మరణము (రోమా. 6:23). దేవుని నుండి నిత్యము వేరైపోవుట నిత్యమరణము. యిది పాపము యొక్క ఘోర ఫలితము.

## పాపవిమోచన

అయితే మానవుని సృజింపకముందు మానవుడు పాపములో పడతాడని దేవునికి తెలుసునా? అనే ప్రశ్న మనకు రావచ్చును. అవును, ఆయనకు తెలుసు. సరిగదా, పాపములో పడిన మానవుని ఆయన క్రీస్తు ద్వారా విమోచింపవలసి వచ్చునని కూడా ఆయన ఎరిగియుండెను. ఏలయనగా, "మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాదివేయబడక మునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" అని లేఖనములు చెప్పుచున్నవి (ఎఫెసీ 1:6). మనలను విమోచించుటకు క్రీస్తుయేసు జగత్తు పునాది వేయబడక మునుపే నియమింపబడెను అని 1పేతురు 1:20లో వ్రాయబడి యున్నది.

లేఖనములను చదువుట వలన మనకు నిస్సందేహముగా విశదపరచ బడుచున్నదేమిటంటే - దేవుడు మానవులయెడల అమితమైన ప్రేమ కలిగి యున్నాడు. యెహోవా దేవుని ప్రేమకు మానవులు అర్హులుకారు. మనము భక్తి

హీనులమును, పాపులమును, శత్రువులమునైయుండగా ఆయన మనకు రక్షణ నను(గహించుచున్నాడు (రోమా. 5:6-10). "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమయున్నది" (1 యోహాను 4:10).

దేవుని ప్రేమ సార్వజనకమైనది. ఆయన అందరినీ ప్రేమించుచున్నాడు. ఇందులో వివక్షత లేదు. "ఆయన మనుష్యులందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారైయుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2:4). ఏలయనగా ఎవడును నశింపవలెనని ఆయన యిచ్ఛయించుటలేదు (2 పేతురు 3:9).

అందువలన "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను" (గలతీ. 4:4). అంటే మానవుని విమోచనాకార్యక్రమము అంతా ముందు గానే సంకల్పించబడి, సరియైన సమయానికి అది అమలుచేయబడెనని ఈ లేఖనభావం. యేసుప్రభువు మానవాతీతుడై మానవుల మధ్య జన్మించి జీవించెను. గొప్ప బోధలుచేసెను. ఎన్నో అద్భుతములుచేసెను. సిలువపై మరణమొందెను. సమాధిచేయబడెను. మూడవదినమున తిరిగిలేచెను. పరమునకారోహణమాయెను. ఆయన మరల వచ్చును. బైబిలును చదువువాడు ఆ గ్రంథమంతయు క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానములపై ఆధారపడియున్నదని గమనించేయగలడు.

ఇప్పుడు మానవుడు యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందితే రక్షింపబడగలడు. యేసుక్రీస్తు మరల రాబోవుచున్నాడను వాగ్దానముతో బైబిలు ముగియుచున్నది. ఆయన మరల వచ్చినపుడు తన వారిని నిత్యజీవములోనికిని, తన శత్రువులను నిత్యనరకములోనికిని పంపును. ఆయన మరల ఎప్పుడువచ్చునో మానవులకు తెలియదు. ఆ చివరి గడియకొరకు మానవులను హెచ్చరించుచు, సిద్ధపరచుట కూడ బైబిలు యొక్క ఉద్దేశ్యమైయున్నది. నీ చేతిలోని పరిశుద్ధ గ్రంథమును శ్రద్ధగా చదువుచున్నావా?

# బోధకురాండ్రు

## ( Women Preachers )

నేటి దినాల్లో పలుస్త్రీలు బోధకురాండ్రవుచున్నారు. అనేక సంఘాల వేదికలపై వారు మాట్లాడుచున్నారు. పలు టీవీ కార్యక్రమాల్లో కూడ వారు ఇప్పుడు బోధించు చున్నారు. స్త్రీల స్వాతంత్ర్యము, స్త్రీల ఉద్యమాలకాలములో, బోధకులున్న చో బోధకురాండ్రు ఎందుకు వుండకూడదు? పురుషులతో సమానముగా అన్ని పనుల లోను స్త్రీలు ఎందుకు వుండకూడదు? అనేది వీరి తలంపు.

అయితే ఇక్కడ పురుషులు స్త్రీలను అణచివేయుట గాని, బోధించుటకు నిషేధించుటగాని, యిదివరకు పురుషుల పాత్రలో స్త్రీలకు చోటివ్వకపోవుటగాని గాక, సంఘములో స్త్రీలకు దేవుడు అట్టి బహిరంగ నాయకత్వ స్థానము నిచ్చు చున్నాడా యనునది మనము ఆలోచింపదగిన విషయము.

యేసుక్రీస్తు యొక్క బహిరంగ సువార్తసేవను మనం గమనిస్తే ఆయన 12 మందిని అపొస్తలులుగా ఏర్పరచుకొన్నారు. ఈ అపొస్తలులు ఎవరు ? అందరు పురుషులే ! తరువాత ఇస్కరియోతు యూదా క్రీస్తును అప్పగించి మరణించిన తరువాత, అతని స్థానమును భర్తీ చేయుటకు మరొకడు నియమింపబడెను. ఆయన శిష్యులలో నమ్మకమైన స్త్రీలున్నను, పురుషుడే అపొస్తలునిగా ఎన్నుకొన బడెను (అపొ.కా. 1:26). అన్యజనులకు అపొస్తలునిగా దేవుడు ఒకని ఎంచు కొన్నప్పుడు కూడ, ఒక పురుషుడే, పౌలు ఎన్నుకొనబడెను.

క్రీస్తు సంఘము స్థాపించబడిన తరువాత, అది అభివృద్ధి జెందుచు విశ్వవ్యాప మాయెను. సంఘములో నాయకులు అవసరమాయెను. 1తిమోతి 3వ అధ్యాయము, తీతు మొదటి అధ్యాయములు ప్రకారము అర్హత గల క్రైస్తవుల స్థానికసంఘములలో పెద్దలుగను, పరిచారకులుగను ఏర్పరచబడిరి. ఈ రెండు సందర్భములలోను వారు పురుషులేగాని, స్త్రీలు కాదు. స్త్రీలు కూడ సంఘములో పెద్దలు కావచ్చును గదా అంటే, పెద్దగా యుండువాడు ఏకపత్నీ పురుషుడై యుండాలని బైబిలు చెప్పుచున్నది. ఒక స్త్రీ ఏకపత్నీ పురుషుడెట్లు కాగలడు ?

ప్రభువు యొక్క మరణ సమాధి పునరుత్థానముల తరువాత ఆయన అపొస్తలులకు అగపడెను. వారందరు పురుషులే. వారు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించవలెనని ఆయన వారిని ఆజ్ఞాపించెను (మార్కు 16:15-16).

అపొ.కా. 2వ అధ్యాయమునకు వచ్చుసరికి ఆ అపొస్తలులందరు పెంతెకొస్తను పండుగ దినమందు ఏకముగా కూడి యుండగా, వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిరి. వారందరు పురుషులే. వారు అక్కడ కూడి వచ్చిన జన సమూహమునకు సువార్తను బోధించిరి. ఆ దినమందు యించుమించు మూడువేలమంది, స్త్రీ పురుషులు వాక్యము నంగీకరించి బాప్తిస్మము పొందిరి. ప్రభువు వారిని తన సంఘముతో చేర్చుకొనెను.

తదుపరి, యోగ్యమైన మంచిమనసు కలిగి పరిశుద్ధాత్మతో నిండియున్న ఏడుగురు పురుషులు అపొస్తలులకు సహాయకులుగా ఏర్పరచబడిరి. వారు పరిచారకులుగా సంఘములో పనిచేసిరి.

అపొస్తలుల కార్యముల గ్రంథమును చదువుచుండగా, బహిరంగముగా సువార్త బోధించిన వారందరు పురుషులేయని గమనించగలవు. సంఘములో నాయకత్వము వహించిన వారందరు పురుషులే యని గమనించగలవు.

దీనిని బట్టి మనము గ్రహించవలసిన దేమనగా, ప్రభువు తన సంఘములో వాక్యోపదేశము చేయుటకును, బహిరంగ నాయకత్వము వహించుటకును పురుషులనే ఎంచుకొనెను. స్త్రీలు ఆరాధన కార్యక్రమము నడుపుటగాని, పాటలు నడుపుట గాని, ప్రార్థనలు చేయుట గాని, ప్రభురాత్రి భోజనమునందించుట గాని, వాక్యోపదేశము చేయుటగాని క్రొత్తనిబంధనలో ఎక్కడా నీవు కనుగొనలేవు. నాయకత్వపు స్థానములో దేవుడు పురుషులనుంచెను. అట్లు చేయుటలో ఆయన జ్ఞానమును మనము గౌరవించాలి.

పైనుదహరించిన సంగతులను బట్టియే స్త్రీలు బహిరంగ కూటములలో నాయకత్వము వహించరాదని ఎంచగలమా ? కాదు, గాని పరిశుద్ధ లేఖనములు వివరముగా ఇట్లు చెప్పుచున్నవి :

"స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. మొదట ఆదాము తరువాత హవ్వయును నిర్మింపబడిరికారా ? మరియు ఆదాము మోసపరచబడలేదు గాని, స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను" (1తిమోతి 2:11-14).

సంఘములో స్త్రీలు మౌనముగా యుండవలెనను నిషేధాజ్ఞ సాంఘికమైనది ( Cultural) కాదుగాని, దేవుని యొక్క ప్రత్యక్ష ఆజ్ఞయైయున్నది. "స్త్రీలు సంఘములలో మౌనముగా ఉండవలెను; వారు లోబడి యుండవలసినదే గాని, మాటలాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. వారు ఏమైనను నేర్చుకొనగోరిన యెడల, ఇంట తమ భర్తలనడుగవలెను. సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము" (1కొరింథీ 14:34-35).

పాతనిబంధన కాలములో దేవుడు ప్రవక్తల ద్వారా మాటలాడెను. వారందరు పురుషులే. లేఖనములను వ్రాయుటకు ఆయన అందరిని పురుషులనే వాడెను. రాజులు, యాజకులు కూడ పురుషులే. న్యాయాధిపతులలో ఒకామె (దెబొరా) తప్ప అందరు పురుషులే. ఒక స్త్రీ న్యాయాధిపతిగా ఎందుకుండెను ? ఏలయనగా ఆకాలమందు ఇశ్రాయేలీయులను నడిపించుటకు ధైర్యముగల పురుషుడొక్కడును లేనందున ! దేవుడు తమకిచ్చిన బాధ్యతలను విస్మరించే పురుషులందరికీ నేడు ఇదొక హెచ్చరికయై యుండాలి. నాయకత్వము వహించుటకు పురుషులను, సహాయము చేయుటకు స్త్రీలను దేవుడు సృజించాడు. ఆయన ఏర్పరచిన నాయకత్వ క్రమమును మార్చుటకు మనకు అధికారము లేదు.

స్త్రీలు గృహమును వీడి బయట ప్రపంచములో పనికొరకు అడుగిడినప్పుడు, గృహము దెబ్బతిన్నది. కాలము గడిచిన కొలది స్త్రీలు దేవుడు తమకిచ్చిన పనిని నిర్లక్ష్యము చేసి పురుషుల పనిలోనికి ప్రవేశించారు. అనేక సందర్భాలలో నేడు పురుషులు తమ బాధ్యతను నిర్వర్తించుటలేదు; వారు తమ గృహాలను, భార్యను, పిల్లలను విడిచి తమ కొరకే జీవించుచున్నారు. తమ తమ బాధ్యతలు తారుమారగు

చున్నందున గృహము, సంఘము, ఈలోకము కీడు నెదుర్కొనుచున్నది. మనము దేవుని సంకల్పము నొద్దకు తిరిగి వెళ్లుట అత్యవసరము. పురుషులు తమ నాయకత్వపు బాధ్యతను స్వీకరించాలి, స్త్రీలు గృహమునకు, కుటుంబమునకు, తమ భర్తలకు కట్టుబడి యుండాలి.

అయితే సంఘములో స్త్రీ చేయదగిన పని, వహించవలసిన బాధ్యత యేమిాలేదా ? ప్రిస్కిల్ల అనునామె తన భర్తతో కలిసి అపొల్లోకు వాక్యోపదేశము చేసినట్లు మనము లేఖనములలో చూడగలము (అపొ.కా. 18:26). ఆదిమ సంఘస్థులు తరుచు స్త్రీల యిండ్లలో కూడుకొనిరి (రోమా 16); సువార్త బోధించుట కొరకు స్త్రీలు సహాయసహకారములందించిరి. సంఘములో స్త్రీలు యితర స్త్రీలకు, చిన్నపిల్లలకు బోధింపవచ్చును (తీతు 2:3-5). గృహమును, పిల్లలను చూచుకొను అతి ప్రాముఖ్యమైన బాధ్యత కూడ స్త్రీలకు అప్పగింపబడినది (1తిమోతి 5:14). వారు దేవునికి లోబడితే దేవుడు వారిని తప్పక దీవిస్తాడు !!

- జె.సి. ఛోట్

# పాపము

## (Sin)

మనలో చాలమంది ప్రతిరోజు వార్తాపత్రికలు చదివే అలవాటును కలిగి యున్నాము. వార్తాపత్రికలను చదివేకొలదీ మనకేమి కన్పడుచున్నది ? దొంగ తనాలు, దోపిడీలు, నరహత్యలు, అపహరణలు వగయిరా రోజు రోజుకూ పెరిగి పోవుచున్నవి. ఈలోకం అంతా గందరగోళంతో నిండియున్నట్టున్నది. దానినే మనం పాపం అని కూడా చెప్పుకోవచ్చును. "లోకమంతయు దుష్టుని యందు న్నదని" భక్తుడైన యోహాను వ్రాసాడు (1యోహాను 5:19). పాపము సార్వజనిక మైనది. ఏ భేదమును లేదు అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). "మనము పాపములేని వారమని చెప్పు కొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్య ముండదు.... మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను

అబద్ధికునిగా చేయు వారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1యోహాను 1:8,10).

పాపము ఎంత ఘోరమైనదంటే దేవుడు దానిని అసహ్యించుకొంటాడు. సృష్టికర్తయైన దేవునికి వ్యతిరేకముగా చేయు నేరమే పాపము. పాపము యొక్క పరిహారాన్ని మనం పొందకపోతే నరకాగ్నిలో మనం నశింతుము. (ప్రకటన 21:8). అయితే దేవుడు ప్రేమయై యున్నాడు (1యోహాను 4:8). గనుక మనలో ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరు చున్నాడు (2పేతురు 3:9).

పాపమనగా యేమిటి ? ఆదిమ గ్రీకుభాషలోని మాటలో గురి తప్పిపోవుట అనే భావం ఇమిడి యున్నది. ఒక విలుకాడు తన గురిని తప్పిపోయినప్పుడు అతడు 'పాపము' చేసాడని చెప్పబడేది. మన గురి దేవుని చిత్తము అయినప్పుడు, దేవుని చిత్తాన్ని జరిగించకుండా తప్పిపోవుట పాపము అనబడతాది.

## ఆజ్ఞాతిక్రమం

మరల, "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతి క్రమమే పాపము" (1యోహాను 3:4). అతిక్రమించడం అంటే హద్దు మీరిపోవడం అనియర్థం. "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు" (2యోహాను:9). క్రీస్తుబోధను అతిక్రమించడం పాపము. హద్దు మీరడమే కాకుండా మనం చేయవలసినది చేయక పోవడం కూడా పాపమే. "కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" (యాకోబు 4:17). అందువలన సకల దుర్నీతియు పాపము (1యోహాను 5:17). దేవుని ఆజ్ఞలన్నియు నీతి గనుక (కీర్తన 119:172), ఆయన ఆజ్ఞలను బట్టి నడువని వాడు దుర్నీతిలో యున్నవాడవుతాడు. "మన మందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనందరి దోషమును అతనిమీద (క్రీస్తుమీద) మోపెను" అని యెషయా చెప్పాడు (యెషయా 53:6). ప్రతివాడు దేవుని

మార్గములో నడుచుటకు ఎంచుకొనక తనకిష్టమైన త్రోవకు తొలగిపోవుట ఇక్కడ గమనించాలి.

కొందరు దేవుని చిత్తాన్ని జరిగించుటకు గురిపెట్టరు. నిజానికి వారు దేవునికి లోబడినా, లోబడక పోయినా పరవాలేదనుకొంటారు. తమ యిష్టం వచ్చినట్లు జీవించాలని ఎంచుకొంటారు.

వీటిని గూర్చి ఒకసారి ఆలోచించు. మనం చేయవలసినది చేయకపోయినా, చేయకూడనిది చేసినా, దేవుని చిత్తాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేసినా పాపమే. మనం చేసే దానిని బట్టి, చెప్పే దానిని బట్టి, ఆలోచించే దానిని బట్టి కూడా పాపము చేయగలము. ఏలయనగా, "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు వేశ్యాగమనములు, దొంగతనములు అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్ర పరచును" అని యేసుప్రభువు చెప్పారు (మత్తయి 15:19).

ఈ సత్యములను నీకు నీవే ఆలోచించుకో. నీవు చేయవలసినది చేయ కుండా ఎప్పుడైనా యున్నావా ? నీవు చెప్పకూడని మాటలు ఎప్పుడైనా చెప్పావా ? చేయకూడనిది చేసావా ? దేవుని చిత్తానికి సరిపడని తలంపులు తలంచావా ? ఇంకోమాటలో నీవు పాపం చేసావని అంగీకరించగలవా ? ఇందులో అనుమానం యేమిలేదు. మనందరం ఏదో రీతిగా పాపము చేసిన వారమే. మనందరికీ రక్షకుడు అవుసరమే.

## నిత్య మరణం

అపవాది మనందరినీ "శరీరాశ, నేత్రాశ, జీవపుడంబముల" ద్వారా పాపములో పడేటట్టు శోధించుచునే యుంటాడు. "దురాశ గర్భము ధరించి పాపమును కనగా పాపము పరిపక్వమై మరణమును కనును" (యాకోబు 1:15). "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). మరణమనగా ఎడబాటు అని యర్ధము. శరీరమునుండి ప్రాణము వేరైనప్పుడు భౌతిక మరణము

సంభవించును (యాకోబు 2:26). మానవుడు దేవునినుండి వేరైపోవుట ఆత్మీయ మరణము. పాపమువలన ఈ రెండు మరణములు సంభవించును. ఆదాము హవ్వల పాప పర్యవసానముగా మనందరము శారీరకంగా మరణించుచున్నాము. గాని మన స్వకీయ పాపము వలన మన ఆత్మ దేవునినుండి వేరై పోయే ప్రమాద మున్నది. "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (యెషయా 59:1-2). యేసుక్రీస్తు ద్వారా మన పాపములకు పరిహారము పొందక పోయినట్లయితే మనకు నిత్యనాశనము తథ్యము. ఎవరైతే క్రీస్తు సువార్తకు లోబడరో "అట్టివారు ఆయన సముఖమునుండియు, ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి నిత్యనాశనమను దండన పొందుదురు" (2థెస్స 1:9).

మన జీవితములో యున్న పాపము వలన మనకు ఆత్మీయ మరణం సంభవించును. అపరాధముల చేత, పాపములచేత మనం చచ్చినవారముగా యుంటాము (ఎఫెసీ 2:1). అవి నిర్మూలించబడకపోతే నిత్యనాశనములోనికి పోతాము. మనము యేసుప్రభువునందు విశ్వసించకపోతే, పాపముల విషయమై మారుమనస్సు పొందకపోతే, పాపములలోనే మరణించితే రక్షింపబడలేము. యేసుప్రభువు "నేను ఆయననని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" చెప్పారు (యోహాను 8:24). మరల "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురని" ఆయన చెప్పారు (లూకా 13:3,5).

అయితే "దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగా క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో

సమాధాన పరచబడిన యెడల, సమాధాన పరచబడినవారమై ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:8-10).

దేవుడు మనయెడల తన కృపను చూపుచున్నాడు. మనందరినీ ప్రేమించుచున్నాడు. అందరూ రక్షింపబడాలని కోరుచున్నాడు. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

## జీవ మార్గం

మనము నిత్య శిక్షను తప్పించుకొని నిత్య జీవములో ప్రవేశించాలంటే యేసుక్రీస్తు ఒక్కడే మార్గము. ఆయన తన పవిత్ర రక్తాన్ని సిలువపై చిందించి మన పాపముల కొరకు తన్నుతాను బలియాగముగా చేసికొని మన రక్షణ మార్గాన్ని తెరిచారు. అందుకే నేనే మార్గమును సత్యమున జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు అని ఆయన చెప్పారు (యోహాను 14:6).

పాపములనుండి రక్షింపబడాలంటే యేసుప్రభువునందు విశ్వాసముంచాలి. ఆయన దేవుని కుమారుడు. "కుమారుని యందు విశ్వాసముంచు వాడే నిత్యజీవము గలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" (యోహాను 3:36). మన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. దేవుడు అందరును, అంతటను మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు (అపొ.కా. 17:30). యేసుప్రభువునందున్న విశ్వాసాన్ని మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి. "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10). మరియు పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందాలి (అపొ.కా. 2:38). ఏలయనగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16). నీ పాపముల నుండి రక్షింపబడగోరుచున్నావా ?

- జాషువా గూటం

# మతశాఖల తత్వము క్రైస్తవ్యము కాదు

## (Denominationalism is not Christianity)

పరిచయము : క్రైస్తవులందరు కేథలిక్కులే యని క్రైస్తవేతరులు ఏలాగు తలంచుదురో, ఆలాగే క్రైస్తవ్యమంటే అంతా గందరగోళమని మరికొంతమంది తలంచుదురు. ఏలయనగా వారిలో యున్న శాఖోపశాఖలు వివిధ సంగతులను బోధించుదురు. ఈ శాఖోపశాఖలన్నీ మతశాఖలే, లేక డినామినేషన్లే. బైబిలు వాటిని ఎక్కడా సమర్థించుట లేదు. సరిగదా ఖండించుచున్నది. అందువలన కేథలిక్కులు వలె, మతశాఖలు లేక మతశాఖల తత్వము కూడ బైబిలుకు సుదూరమైనదని ఈ వ్యాసము ద్వారా తెలిసికొనబోవుచున్నాము.

## వాటి పునాదులు వేర్వేరు

ప్రతి మతశాఖయు క్రీస్తునే పునాదిగా కలిగియున్నానని చెప్పుకొనును. గాని జాగ్రత్తగా పరిశీలించితే దాని వాస్తవము బయలుపడును. క్రైస్తవ్యము యొక్క పునాది యేమిటి ?

**మతశాఖలు :** డినామినేషన్లను ఎవరు స్థాపించినను, అవి ఎప్పుడు, ఎక్కడ స్థాపించ బడినను అవన్నియు క్రీస్తువే. వారు బైబిలును బోధించి క్రీస్తునందు విశ్వసించినంత కాలము ఫరవాలేదు.

వాటిలో కొన్నింటి పునాదులు క్రీ॥శ 1521,1535,1536, 1607 మొ॥గు సంవత్సరములలో వేయబడెను.

క్రైస్తవ్యము : "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు నుడివెను (మత్తయి 16:18).

"వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది క్రీస్తే" యని అపొ.పౌలు చెప్పెను (1కొరింథీ 3:11).

క్రీస్తు తానే పునాదియై తన సంఘమును నిర్మించెను. అనేక శతాబ్దముల తరువాత మానవులు యితర సంఘములను స్థాపించిరి. అవి మానవాభిప్రాయముల పైనను,

వారి భావముల పైనను నిర్మించబడెను. అవే క్రీస్తు సంఘమయితే ఎప్పుడు, ఎక్కడ, ఎవరిచే నిర్మించబడెనో అది అత్యవుసరము.

## అధికార స్థావరములు వేరు

ప్రతి డినామినేషన్ కూడ తాను బైబిలును కొంతమట్టుకు అనుసరించు చున్నానని చెప్పుకొనును గాని దాని బోధలు, ఆచారములు బైబిలుతో పోల్చి చూచిన యెడల వేరుగా యుండును. ఏలయనగా వాటి అధికార స్థావరములు వేర్వేరు. వాటి అధికార స్థావరములు యేమిటి ?

మతశాఖలు : బైబిలు + మానవకల్పిత సిద్ధాంతములు = మతశాఖలు

బైబిలు + పారంపర్యాచాములు + పోపు = కేథలిక్కులు

బైబిలు + వెస్ట్ మినిస్టర్ విశ్వాస ప్రమాణము = ప్రెస్బిటేరియనులు

బైబిలు + 39 విశ్వాస సూత్రములు = ఎపిస్కోపల్ వారు

బైబిలు + విశ్వాసక్రమము (discipline) = మెథడిస్టులు

బైబిలు + కేటకిసమ్ = లూథరనులు

బైబిలు + ఫిలదెల్ఫియా విశ్వాస ప్రమాణము = బాప్టిస్టులు

బైబిలు + మోర్మనులు పుస్తకము = మోర్మనులు

బైబిలు + ఎలెన్ జి.వైట్ వ్రాతలు = ఎడ్వంటిస్టులు

క్రైస్తవ్యము : "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును నీతి యందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమోతి 3:16-17).

లేఖనములు రక్షణార్థమైన జ్ఞానము కలిగించును (2తిమో 3:15). యేసుప్రభువు నాటి శాస్త్రులవలె గాక, అధికారము గలవాని వలె వారికి బోధించెను (మత్తయి 7:29). మత్తయి 28:20.

క్రైస్తవ్యమునకున్న అధికార స్థావరము యేసుక్రీస్తు, ఆయన అపొస్తలులు, క్రొత్తనిబంధనలో వారు చెప్పిన మాటలును. ఏ జాతి విత్తనము ఆ జాతి ఫలమునే యిచ్చునను గొప్ప వాస్తవమును మతశాఖలు విస్మరించాయి (ఆది.కా. 1:11-25). దేవుని వాక్యమే దేవుని రాజ్యము యొక్క విత్తనమని యేసుప్రభువు చెప్పారు (లూకా 8:11). అది మానవుల హృదయములో నాటబడినప్పుడు దాని జాతి ప్రకారమైన ఫలమునే యిచ్చును. మొదటి శతాబ్దములో దేవుని వాక్యము క్రైస్తవులను, క్రైస్తవులను మాత్రమే తయారు చేసింది (అపొ.కా. 11:26; 26:28; 1పేతురు 4:16). ఏతరములోనైనా విత్తనము అదే గనుక, అదేరకమైన ఫలము నిచ్చును. "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" అని యేసుప్రభువు చెప్పెను (మత్తయి 24:35). ఆయన వాక్యము శాశ్వతము, దానిలో ఏవ్విధమైన మార్పులేదు. అందువలన విత్తనములో కూడ మార్పులేదు. మతశాఖలలో యున్న సమస్య యేమంటే వాటి అధికార స్థావరములు వేర్వేరు. అందువలన వాటి ఫలములు కూడా వేర్వేరే.

మనం క్రైస్తవులమైనంత మట్టుకు ఎవరు ఎలాగ దేవుని సేవించినా ఫర్వా లేదని కొందరంటారు. యేసు అట్టివారి సేవలో గొప్ప వ్యత్యాసమున్నదని చెబుతారు. "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తము జరిగించువాడే ప్రవేశించును" అని ఆయన చెప్పెను (మత్తయి 7:21). నిజ క్రైస్తవ్యము క్రీస్తును, ఆయన సువార్తను తప్ప మరి దేనిని ఎరుగదు. క్రొత్తనింబంధన ఒక్కటే దాని మార్గదర్శి.

## వాటి పేర్లు వేర్వేరు

పేరులో ఏమైనా ప్రాముఖ్యత వున్నదా ?

మతశాఖలు : పేరులో యేమీ లేదు.

"గులాబిని ఏ పేరుతో పిలిచినా అంతే మధురంగా యుండును.

"మేమంతా క్రైస్తవులమే"

"క్రీస్తుకు ఘనత యిచ్చునంత కాలము మేము క్రీస్తునే ఆరాధించు చున్నాము"

"ప్రేమగలిగి ప్రాముఖ్యతలేని వాటికొరకు వాదనలు పెట్టుకొన వద్దు".

క్రైస్తవ్యము : "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" **(అపొ.కా. 11:26).**

"ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" **(1పేతురు 4:16).**

"మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామమునే మనము రక్షణపొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఈయ బడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" **(అపొ.కా. 4:12).**

"మరియు మాటచేత గాని, క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స **3:17).**

క్రీస్తు **శిష్యులకు ఈయబడిన** నామము ఒకే ఒక్కటి-అది క్రైస్తవులు అను నామము. క్రైస్తవుడనగా క్రీస్తుకు చెందినవాడని యర్థము. క్రొత్తనిబంధనలో క్రైస్తవులు సహోదరులని, పరిశుద్ధులని, శిష్యులని వర్ణించబడినది. గాని వారు కేథలిక్కులని, ప్రొటెస్టాంటులని, బాప్టిస్టులని, మెథడిస్టులని మొ॥లగు నామములతో పిలువబడ లేదు. ఈ నామములు బైబిలులో ఎక్కడా కనబడవు. సరిగదా వాటిని బట్టియే మానవులు విభజింపబడి యున్నారు.

## వాటి ఉద్దేశ్యములు వేర్వేరు

**వాటి** తత్వమును బట్టి మతశాఖలు విభజనను ప్రోత్సహిస్తాయి. **మతశాఖయనగా ఆదిమ** సంఘమునుండి విడిపోయిన శాఖ, వేరైపోయిన గుంపు

అని యర్ధము. అందువలన మతశాఖలలో యున్నవారు ఆదిమ సంఘములో గాక, దానికి వేరైన ఒక శాఖలో యున్నామని తెలియకుండగనే ఒప్పుకొనుచున్నారు. అయితే విశ్వాసులందరి ఐక్యత సాధ్యమా ?

మతశాఖలు : అన్ని సంఘాలు మంచివే.
నీ కిష్టమొచ్చిన సంఘములో చేరవచ్చు.
నీకిష్టమొచ్చిన సంఘానికి వెళ్లు.
ఈ సంఘాలన్నీ ఒకే గమ్యానికి చేరుకొనే వేర్వేరు రహదార్లు.
డినామినేషన్లన్నీ ఆదిమ సంఘము యొక్క కొమ్మలే.

క్రైస్తవ్యము : యేసు ఇట్లు ప్రార్థించెను: "తండ్రీ నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమైయుండవలెనని వారికొరకు మాత్రమునేను ప్రార్థించుటలేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరు ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20-21).
ఒకే ఒక్క గొర్రెల దొడ్డి యున్నది (యోహాను10:16).
శరీరమొక్కటే (ఎఫెసీ 4:4; 1:22-23).
"ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు" అని యేసు చెప్పెను. ఆయన మతశాఖలతో గాక తన శిష్యులతో ఈ మాట చెప్పెను (యోహాను 15:5).
విభజనలు లేక శాఖలు ఖండించబడెను (1కొరింథీ 1:10-13).

నిజ క్రైస్తవ్యము ఏకత్వాన్ని ప్రతిపాదిస్తుంది. మతశాఖల తత్వము భిన్నత్వాన్ని ప్రతిపాదించుచున్నది. ఆదిలో "విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమిష్టిగా ఉంచుకొనిరి" (అపొ.కా. 2:44). "విశ్వసించిన వారందరు ఏక హృదయమును, ఏకాత్మయు గలవారై యుండిరి".

అపొ.పౌలు క్రైస్తవులను ఇట్లు హెచ్చరించాడు. "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి

యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు. వారు ఇంపైన మాటల వలనను ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చు దురు" (రోమా 16:17-18). ఐక్యత కొరకు క్రొత్తనిబంధన దిగువ సూత్రములను ప్రతిపాదించినది. ఈ ఏడు అంశములలోను ఏకత్వము అత్యావసరము (ఎఫెసీ 4:3-6).

| | | |
|---|---|---|
| శరీరమొక్కటే | - | నిర్మాణంలో ఏకత్వము (Unity of organisation) |
| ఆత్మయు ఒక్కడే | - | జీవనంలోను బయల్పాటులోను ఏకత్వము (Unity in LIfe and Revelation) |
| నిరీక్షణ ఒక్కటే | - | సంకల్పములోను, కోరికలోను ఏకత్వము (Unity in plan and desire) |
| ప్రభువు ఒక్కడే | - | అధికారంలో ఏకత్వము (Unity in Authority) |
| విశ్వాసము ఒక్కటే | - | వర్తమానములోను, బోధలోను ఏకత్వము (Unity in message and doctrine) |
| బాప్తిస్మము ఒక్కటే | - | ఆచరణలో ఏకత్వము (Unity in Practice) |
| దేవుడు ఒక్కడే | - | ఆరాధనలో ఏకత్వము (Unity in Worship) |

"అవయవములు అనేకములైనను శరీరమొక్కటే". "అయితే శరీరములో వివాదము లేకుండా . దేవుడు శరీరమును అమర్చియున్నాడు". "అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు" (1కొరింథీ 12:20,25,27). క్రీస్తు యొక్క శరీరమే క్రీస్తు సంఘము (కొలస్స 1:18).

(సశేషము)

# దేవుని రాజ్యవిషయములు

దేవుని రాజ్యము అనగా దేవుని సంఘము. అది క్రీస్తు సంఘము. (రోమా. 16:16) రాజ్యమే సంఘము అను విషయమై కొన్ని సంగతులు తెలిసికొందాము.

1) దేవుని రాజ్యము సమీపించియున్నది :- "యేసు-కాలము సంపూర్ణమై యున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పుచు, దేవుని సువార్త ప్రకటించుచు, గలిలయకు వచ్చెను." మార్కు 1:14,15. మరియు మత్తయి 3:1,2; 4:17 చూడుము.

2) దేవుని రాజ్యము వచ్చువరకు కొందరు మరణించరు :- "మరియు ఆయన - ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవునిరాజ్యము బలముతో వచ్చుట చూచు వరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను." మార్కు9:1, లూకా 9:27.

3) దేవుని రాజ్యము మీ మధ్యనే వున్నది :- "దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు ఆయన నడిగినపుడు, ఆయన దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది గనుక, ఇదిగో ఇక్కడని, అదిగో అక్కడని చెప్ప వీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను". లూకా 17:20,21. కనుక దేవుని రాజ్యము మనుష్యులతో కూడుకొనినదై యున్నది.

4) మనుష్యులనుకొని... రాజ్యముగా చేసెను :- "నీవు వధింపబడిన వాడవై, నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడు వారిలోను, ప్రతి ప్రజ లోను, ప్రతి జనములోను దేవుని కొరకు మనుష్యులనుకొని మా దేవునికి వారిని రాజ్యముగాను, యాజకులను గాను జేసితివి; గనుక వారు భూలోకమందు ఏలుదురని క్రొత్తపాట పాడుచున్నారు" (ప్రకటన 5:10; అపొ. 20:29).

గమనిక :- యేసు పునరుత్థానమును గూర్చి, ఆయన రాజ్యమును గూర్చి ప్రకటించు నిమిత్తము ప్రతి క్రైస్తవుడు యాజకుడై యున్నాడు (1పేతురు 2:9).

**5)** రాజ్యనివాసులుగా చేసెను :- "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్స **1:13**).

**6)** రాజ్యములో పాలివాడను :- "మీ సహోదరుడను, యేసును బట్టి శ్రమలోను, రాజ్యములోను, సహనములోను పాలివాడనునైన యోహానను నేను దేవుని వాక్యము నిమిత్తమును, యేసుని గూర్చిన సాక్ష్యము నిమిత్తమును పత్మాసు ద్వీపమున పరవాసినైతిని" (ప్రక **1:9**).

గమనిక:- సంఘమే ఆయన రాజ్యము. ఆయన రాజ్యమునకు భూమిమీద కేంద్రస్థానము లేదు; అధికారిలేడు. కేంద్రస్థానం పరలోకము, అధికారి క్రీస్తు.

**7)** రాజ్యమును తండ్రికి అప్పగించును :- "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును" (**1**కొరింథీ **15:24**).

**5.** రాజ్యము లేక సంఘమును గూర్చి కొన్ని ప్రవచనములు :-

**1)** నిర్గ **19:6.** "మీరు నాకు యాజకరూపమైన రాజ్యము గాను, పరిశుద్ధమైన జనముగాను వుందురని చెప్పుము".

**2)** దాని. **2:44.** "ఆరాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటివి పగులగొట్టి నిర్మూలము చేయునుగాని, అది యుగ యుగముల వరకు నిలుచును".

**3) యెష. 2:2. "అంత్యదినములలో** పర్వతములపైన యెహోవా మందిర పర్వతము **పర్వత శిఖరమున** స్థిరపరచబడి కొండలకంటే ఎత్తుగా ఎత్తబడును ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు".

4) 2వ సమూ. 7:12,13. "నీ దినములు సంపూర్ణములగునపుడు, నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత, నీ గర్భములో నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నానామ ఘనత కొరకు ఒక మందిరమును కట్టించును; అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను".

నిర్గమ, దానియేలు ప్రవచనములలో చెప్పబడిన రాజ్యమును యెషయ, సమూయేలు మందిరముగా చెప్పియుండిరి. అనగా రాజ్యము, మందిరము ఒకటే. ఈ మందిరమునుగూర్చి అపొస్తలుడైన పౌలు యిట్లు చెప్పుచున్నాడు: "...అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింప వలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులు నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును మూలాధారమునై యున్నది (1తిమోతి 3:15). యేసు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమును మందిరమని చెప్పెను (అపొ. 20:28).

పై లేఖనములను బట్టి రాజ్యము, మందిరము, సంఘము ఒకటియై యున్నది. ఇవి ఒకదానికొకటి పర్యాయ పదములు. దానియేలు ప్రవచనములో "దాని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు" అని చెప్పబడినది. రాజ్యము అను సంఘములో చేర్చబడుట; యేసు ఆజ్ఞానుసారం బాప్తిస్మము పొందిన వారికి మాత్రమే ఆ సంఘము (రాజ్యము) చెందును ప్రభువు అనుదినము రక్షణ పొందుచున్న వారిని వారి (సంఘము) తో చేర్చుచుండెను (అ. 2:47).

- జి. మార్కు, నందిగామ.

## సత్యవాక్కు చదువరులకు

### గమనిక

సత్యవాక్కును గత 20 సంవత్సరములకు పైగా విడువకుండా ప్రచురించు చున్నాము. సత్యవాక్కు ఇప్పుడు ప్రతి నెలా పదివేల గృహాలకు వెళ్ళుచున్నది. మరియు అనుదినం ఈ పత్రిక తమకు కావాలని వ్రాసేవారి సంఖ్య పెరుగుచునే యున్నది. ఈ పత్రికను పొందుచున్న పదివేల మందిలోను బహుకొద్ది మంది మాత్రమే ఆర్థికంగా ఈ పత్రికను పోషించుచున్నారు. మిగతా వారందరు ఉచితముగానే పొందుచున్నారు. అయితే ఇకమీదట సంవత్సరానికి కనీసం 25/- రూపాయలు చందా పంపనివారికి ఈ పత్రిక పంపబడదు. ఈ సంవత్సరం డిశంబరులోగా మీరు 25/-రూ॥లు మాకు M.O ద్వారా పంపని యెడల మీకు జనవరి నుండి సత్యవాక్కు అందదు. గనుక గమనించండి. ఈ దిగువ చిరునామాకు మీ M.O లు పంపండి. మీ పూర్తి అడ్రసు M.O కూపను మీద వ్రాయండి : **SATYA VAKKU, P.O. BOX . 80**
**SAMBAMURTHY STREET**
**KAKINADA - 533 004.**

## FREE BIBLE CORRESPONDENCE COURSE IN ENGLISH

For your free course, Please print your complete name and address and send to :

**WORLD BIBLE SCHOOL**
**P.O. Box - 52, Jabalpur - 482001**
**Madhya Pradesh**

When you have completed the full course, you will receive a **certificate**

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

## (క్రీస్తు సంఘం)

## అందిస్తున్న ఆహ్వానం

# గొప్ప ప్రత్యేక బైబిల్ సెమినార్

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
పెర్రి బి. కాతమ్ సెమినార్ హాల్
ఫోర్ట్ స్ట్రీట్, విద్యుత్ నగర్, కాకినాడ-3.

తేదీలు : 2000 నవంబరు 18 నుండి 22 వరకు
(శనివారం నుండి బుధవారం వరకు)

సమయం : ఉదయం 10-30 గం.లు
మరియు
సాయంత్రం 6-30 గం.లు

ప్రసంగీకులు : బ్రదర్. **పెర్రి బి. కాతమ్,** యు.యస్.ఎ.

సోదరులు పెర్రి బి. కాతమ్ ప్రపంచ ప్రఖ్యాత సువార్త బోధకులు. వీరు అమెరికా సంయుక్త రాష్ట్రాలన్నిటిలోను, ప్రపంచంలోని 136 దేశాలలోను సువార్తను ప్రకటించారు. వీరు గొప్ప వక్త మరియు గ్రంధకర్త. ప్రస్తుతం ఇండియా చివరిసారిగా దర్శిస్తున్నారు. వారు ప్రకటించు సువార్త వాక్యం విను గొప్ప తరుణం జారవిడువకండి. మీ కొరకు వసతి, భోజనం ఏర్పర్చబడ్డాయి.

డైరెక్టర్
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
పోస్ట్ బాక్స్ నెం. 57, కాకినాడ, ఎ.పి. - 533 001.
☎ : (రె) 0884 - 364882, (ఆ) 0884 - 372604

**రండి ! క్రీస్తు యొక్క గొప్ప సువర్తమానములు వినండి !**

అక్టోబరు 12వ తేదీ గురువారం రాజమండ్రి గణేష్ నగర్‌లో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయము క్రీస్తు పనికొరకు ప్రతిష్ఠించబడెను. జాషువా గూటం గారు ప్రార్థన పూర్వకముగా రిబ్బను కత్తిరించి ఆలయము యొక్క ప్రారంభోత్సవము చేసిరి. తదుపరి జరిగిన గొప్ప బహిరంగ సభలో సోదరులు పి.జయపాల్ (బైపాస్‌రోడ్, రాజమండ్రి), పాల్ గూటం (గొల్లవిల్లి), జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు ఎ.విశ్వేశ్వరరావ్ (కొవ్వూరు) గారు సభకు అధ్యక్షత వహించి తగు హెచ్చరికలిస్తూ సభను ఘనముగా నిర్వహించిరి. రాజమండ్రి గణేష్ నగర్‌లోను, పరిసర ప్రాంతముల లోను సోదరులు యం.కిరణ్ కుమార్ గారు గొప్ప పరిచర్య చేయుచున్నారు. సోదరులు కిరణ్ గారు గణేష్ నగర్‌లో జరుగుచున్న క్రీస్తు పనిని గూర్చి వివరించిరి. ఆలయ నిర్మాణములో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసిరి. రాజమండ్రి పట్టణములో మరొక క్రీస్తు సంఘ ఆలయమును జయకరముగా నిర్మించగలిగినందుకు కిరణ్ గారిని సోదరులు అభినందించిరి. తదుపరి వచ్చిన వారందరికీ చక్కటి విందును స్థానిక సంఘము ఏర్పాటు చేసిరి.

అక్టోబరు 14,15 తేదీలలో జాషువా గూటం దంపతులు నిజామాబాద్ పట్టణమునకు వెళ్లి అక్కడి సోదరులను పరామర్శించిరి. సోదరులు యన్. టైటస్ గారి కుటుంబమును (ఆయన మరణానంతరము) దర్శించి, ఆదరణ కలుగజేసిరి. 15వ తేదీ ఆదివారము డిచ్‌పల్లిలోను, నిజామాబాద్‌లోను ఉన్న సంఘములలో ఆరాధనలో పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. నిజామాబాద్ జిల్లా పని అంతటిని ఇప్పుడు టైటస్ గారి కుమారుడు ఎబినేజర్ గారు చూచు చున్నారు. అక్కడి పనికొరకు అందరు ప్రార్థించమనవి.

అక్టోబరు 19వ తేదీనాడు రాజమండ్రి వాస్తవ్యులు, బిక్కవోలు బైబిలు స్కూలు డైరక్టర్ యస్. జాన్ గారి కుమారుడు విజై ప్రకాశ్‌కు అనకాపల్లి గుడ్ షపర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.వినయానంద్ గారి కుమార్తె లిడియా గ్రేస్‌తో రాజమండ్రిలో వివాహము ఘనముగా జరిగెను. సోదరులు టి.వి.యన్. కుమార్, రేమండ్ క్లైమర్ గార్లు వివాహ కార్య క్రమమును నిర్వహించిరి. సోదరులు బి.రత్నం (రంపచోడవరం) గారు అధ్యక్షత వహించిరి. జాషువా గారు, తదితరులు వాక్య పరిచర్య చేసిరి. బంధువులు, మిత్రులు, సంఘ నాయకులు, పురప్రముఖులు హాజరై నూతన వధూవరులనాశీర్వదించిరి.

RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/02/99

From :
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001

TO

*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani - Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam.*